



# మరో ప్రపంచం

మల్లాది వెంకట కృష్ణమూర్తి

**మంచం మీద** నిద్ర పోతున్న టాలిన్డ్‌కి మెలకువ వచ్చింది, ఒంటికి నీటి వేడి తగలడంతో. టాలిన్డ్ పడుకున్న మంచం మీది పరుపు సెరిడోన్‌తో చేసినది. ఆ పరుపులో పత్తి బదులు నీరు వుంది. వెంట్రుక అంతలా ఉండే సెరిడోన్ ఇనప రేకులా బలిష్టమైంది కాని, మెత్తగా ఉంటుంది.

పడుకోవడానికి ముందే టాలిన్డ్ సరిగ్గా ఆరు గంటల తరవాత నీరు కాగేలా అలారం సెట్ చేశాడు. పరుపులోని నీరు ఆరు క్షణాల్లో పరుపు కింద అమర్చి ఉన్న లేజర్ కిరణం ద్వారా వేడెక్కింది. నిద్ర లేవడానికి సులభమైన అలారం అది.

టాలిన్డ్ మంచం దిగగానే పరుపులోని నీరు యాంత్రికంగా చల్లబడ సాగింది. బాత్‌రూంలోకి వెళ్ళి, మర మనిషి కున్న స్విచ్‌ని ఆన్ చేశాడు. తరవాత నోరు తెరిచాడు. మరమనిషి కుడి చేతి చూపుడు వేలుని ఉపయోగించి టాలిన్డ్ పళ్ళని తోమింది. తోముతుంటే పేస్ట్ వేళ్లోకి దానంతట అదే పూరింది.

"పేస్ట్ అయిపోతోంది. పేస్ట్ అయిపోతూంది. పేస్ట్ అయిపోతోంది." మూడు సార్లు మరమనిషి మాట్లాడింది తన భాషలో.

టాలిన్డ్ తొడుక్కున్న బట్టలని విప్పి తీసి, వలిపి బుట్టలో పడేసింది. దాని చేతి కున్న మరో వేలు లోంచి నీరు టాలిన్డ్ మీదకి చిమ్మింది. దాని ఎడం అరచెయ్యికి ఉన్న స్పాంజితో ఒక పద్ధతి

ప్రకారం టాలిన్డ్ వంటిని శుభ్రంగా రుద్దింది. తరవాత అలమర లోంచి ఒక జత బట్టలు తీసి టాలిన్డ్‌కి తొడిగి, తల దువ్వింది.

"బెస్ట్ అయిపోయింది."

మరోసారిచెప్పి యథాస్థానానికి వెళ్ళి నిలుచుం దా మరమనిషి. స్విచ్ దానంతట అదే ఆఫ్ అయిపోయింది. అంతసేపు టాలిన్డ్ తన తండ్రి గురించిన ఆలోచనలతో సతమత మవుతున్నాడు.

టాలిన్డ్ తన చేతి గడియారం వంక చేసుకున్నాడు. ముప్ఫయి రెండు—ఇరవై ఎనిమిది గంటలు చూపిస్తోంది.

మొదటి సంఖ్య ముప్పై రెండు సంవత్సరంలో ఎన్నో వారమో సూచిస్తుంది. తరవాతి సంఖ్య నలభై ఆరు ఆ వారం మొదలయ్యాక ఎన్నో గంటో సూచిస్తుంది. అలారంలో నూటఅరవై ఎనిమిదో గంట అయ్యాక మళ్ళీ గడియారంలో ముప్ఫయి మూడు ఒకటి వస్తుంది.

వారంలో మొదటి నలభై ఎనిమిది గంటల్లోనే పనిచేయాలి. మొదటి ఇరవైనాలుగ్గంటల్లో ఎనిమిదో గంట నుంచి పదో గంట దాకా, తరవాత ముప్ఫయి ఒకటో గంట నించి ముప్ఫయి మూడో గంట దాకా ఆఫీస్ పని చేసే వేళలు. మిగతా గంటలన్నీ అంటే నూటఅరవై ఎనిమిదో గంట దాకా సెలవు గంటలే. కొత్త వారంలో మొదటి నలభై ఎనిమిది గంటల్లో మళ్ళీ నాలుగు గంటలు పనిచేయాలి.


టాలిన్డ్ భార్య షింపో అతను లేచిన అరగంటకు నిద్ర లేచింది. ఆవిడ గోడకున్న మీటని నొక్కగానే బెడ్‌లైట్ ఆరిపోవటంతో పాటు నల్లగా ఉన్న ఇంటి గోడల్లోని నలుపు మటుమాయ మయిపోయింది. గాజు పలకలు ఆ గోడలు. అందులోంచి సూర్యకాంతి లేత గులాబి రంగులో ఇంట్లోకి ప్రసరించ సాగింది. పక్క ఇంటి వంక చూసింది—షింపో బాత్ రూమ్‌లోకి వెళ్ళబోతూ. వాళ్ళింటి గోడలు నల్లగాఉన్నాయి. ఇంకా ఎవరూ నిద్ర లేవ లే దన్నమాట. ఆ అద్దాలు ప్రత్యేక మయినవి. అందులోంచి బయటికి చూడవచ్చే కాని బయటి నించి లోపలికి చూస్తే ఏం కనపడదు.

షింపో బాత్‌రూంలోకి వెళ్ళి అయిదునిమిషాల్లో కొత్త దుస్తులతో వచ్చింది.ఆ దుస్తులు దారంతో చేసినవి కావు. కాగితం, క్లనేకల్ అనే ఒక రసాయన పదార్థం కలిపి చేసినవి. బట్టలు ఉతికే పద్ధతే తెలియదు ఎవరికీ. ఇరవై నాలుగు గంటలు ధరించాక వాటిని విడిచి, మరో కొత్త జత వేసుకుంటారు.

"24—36—24— 48—76." చెప్పాడు టాలిన్స్.

"42—31—16—14—14" చెప్పింది షింపో.

ప్రపంచంలో కొన్ని వేల భాష లుండేవి పూర్వం. వాటన్నిటినీ వదిలేసి, అందరూ మాట్లాడ గలిగే అంతర్జాతీయ భాషని అయిదు వందల నలభై రెండు సంవత్సరాల క్రితం ఒక కంప్యూటర్ ద్వారా కనుక్కున్నారు. ప్రపంచం లోని అందరికీ కంప్యూటర్ ఆ భాష నేర్పుతుంది. అక్షరాలనేవి వారికి తెలియదు.




కేవలం అంకెలతోనే ఏర్పడ్డ ఆ భాషలో కొన్ని లక్షల పదా లున్నాయి. మేథమెటికల్ సీక్వెన్స్ ఏర్పడ్డ ఆ భాషని నాలుగు నెలల్లో నేర్చుకోవచ్చు. వ్యాకరణం, సంధులు, సమాసాలు లాంటి బాదర బందీ లేం లేవు అంతర్జాతీయ భాషకి.

"ఆకలేస్తోంది!" చెప్పాడు టాలిన్డ్.

"రెండు నిమిషా లాగండి." చెప్పింది అతని భార్య షింపో.

వంట గదిలోకి వెళ్ళి, పెద్ద అలమరా లోంచి నాలుగు పాత్రలని తీసి స్టవ్ మీద ఉంచింది. స్టవ్ కున్న స్టాప్‌వాచ్‌ని నలభై సెకన్లకి సెట్ చేసి వేడికి సంబంధించిన చక్రాన్ని నలభై రెంటికి తిప్పింది.

లేజర్ కిరణం స్టవ్ మీద పడింది. స్టవ్ కున్న గాజు పలక వేడెక్కింది. సరిగ్గా నలభై సెకన్ల తరవాత యాంత్రికంగా స్విచ్ ఆఫ్ అయి లేజర్ కిరణం మాయమయింది.

ఆ నాలుగు పాత్రలని అందుకుని చిన్న ట్రాలీ మీద ఉంచి బయటికి తీసుకొచ్చింది. లోపల వేడిగా ఉన్నా బయట చల్లగా ఉండటం ఆ పాత్రలని తయారు చేసిన పదార్థ లక్షణ. ఎక్స్‌రే ఆధారంతో ఆ పాత్రలని ఒక వాణిజ్య కంపెనీ రెండు వందల ముప్పై ఆరుసంవత్సరాల క్రితం తయారు చేసింది.

టాలిన్డ్ ఆ పాత్రలమీద నంబర్లని చదివి చెప్పాడు.

"చికెన్ సూప్. వంకాయకూర, అన్నం, ట్రిమ్‌లిన్—గుడ్"

ఒక వాణిజ్య సంస్థ ఆ తక్షణ భోజనాన్ని తయారు చేస్తోంది. ఆ పాత్రల్లో అన్ని పదార్థాలు కలిపి ఉంచి అమ్ముతారు. పొయ్యిమీద పెట్టి వేడి చేస్తే చాలు, వంటకం తయారయిపోతుంది. ఆ సంస్థ పదహారువేల పదహారు వందల పదహారు రకాల వంటకాలని అలా తయారు చేసి అమ్ముతోంది. ఒకసారి ఒకరకం తింటే అది మళ్ళీ కొన్ని వేల గంటల తర్వాత తింటారు. ట్రిమ్‌లిన్ అన్ని పోషక పదార్థాలు, ప్రపంచంలోని రోగ క్రిములని నాశనం చేసే యాంటిబయాటిక్స్ ఉండే ద్రవం. అది నూట అరవై ఎనిమిది గంటల కోసారి ప్రతీ వ్యక్తి ఆరోగ్యంగా ఉండటానికి తప్పక తాగి తీరాలి.

"షాపింగ్ చేయాలి." చెప్పింది షింపో.

టాలిన్డ్, షింపో లిద్దరూ 'షాపింగ్ కాంప్లెక్స్ కనెక్షన్ ఆడియో, విజువల్ లింకప్' సెట్ దగ్గరకి వెళ్ళారు. టాలిన్డ్‌కు మనసులోంచి అతని తండ్రి గురించిన ఆలోచనలు ఇంకా పోలేదు. ఏమవుతుందో?

టి. వి. సెట్ లా ఉండే అది టి. వి. కి ఆరు రెట్లుంది. సున్నా నుంచి తొమ్మిది దాకా బటన్స్ ఉన్నాయి. షింపో ఒకటి, ఎనిమిది బటన్స్‌నొక్కింది.

వెంటనే ఆ సెట్ తెర మీద ఒక ఆరు సంఖ్యలు కనపడ్డాయి.

"ఏంకావాలి?" అడిగిం దో అందమైన కంఠం. అది ఫాన్సీ దుకాణం.

"బెస్ట్."

"నూటనలభై డిన్నులు."

"వద్దు."

ఈ సారి పంతొమ్మిది నొక్కాడు టాలిన్డ్ మీద ఆరు సంఖ్యలు కనబడ్డాయి.

"ఏం కావాలి?" అడిగిం దో కంఠం తియ్యగా.

"బెస్ట్".

"నూటముప్పై ఆరు డిన్నులు,"

అది మరో దుకాణం.

"గుడ్. పధ్నాలుగు ఇరవైమూడు ఇరవై ఎనిమిది ఎనిమిది డాష్ లొంభై ఆరు అకౌంట్."

అది టాలిన్డ్ బాంక్ అకౌంట్ నంబరు. ఆ షాపులోని సేల్స్‌మేన్ బాంక్‌కి కనెక్ట్ చేశాడు. ఆ ప్రాంతానికి ఉన్న ఒకటే బాంక్ అది. టాలిన్డ్ అకౌంట్ లోంచి నూటముప్పైఆరు డిన్నులు ఆ షాపు అకౌంట్‌కి కంప్యూటర్స్ బదిలీ చేశాయి, టాలిన్డ్ ఒప్పుకోగానే.

దాదాపు అరగంట సేపు ఆ దంపతు లిద్దరూ రకరకాల షాపులకు డయల్ చేసి, టి. వి. లో ఆ దుకాణాల్లోని వస్తువులని చూసి నచ్చినవి ఆర్డర్ చేశారు.

కంప్యూటర్స్ బాంక్ అకౌంట్స్‌లోని వాటి ఖరీదుని వివిధ దుకాణాల అకౌంట్‌లకి టాలిన్డ్ అకౌంట్‌లోంచి బదిలీ చేశాయి.

టాలిన్స్ తన అకౌంట్‌లో ఇంకా ఎంత మిగిలి ఉందో టి. వి. లోనే చూసుకున్నాడు.

టాల్డిన్ తన ఆఫీసు గదిలోకి వెళ్ళాడు. సరిగ్గా ముప్ఫై ఒకటో గంట రాగానే ఆ గదిలోని టి. వి. సెట్ వెలిగింది. అందులో ఆఫీసు ఫైల్స్ కనపడ సాగాయి. టాలిన్స్ కంప్యూటర్లు తయారుచేసే ఒక కంపెనీకి సేల్స్ ఎగ్జిక్యూటివ్. ఫైల్స్ లోని అంకెలని చదివి తనే కింద వారికి సూచనలని చెప్పాడు. అతని కంఠం పలికిన సూచనలని ఆ యంత్రం అదే సమయంలో తమ ఇళ్ళలోని ఆఫీసు గదుల్లో కూర్చున్న ఆ కంపెనీ ఇతర ఉద్యోగులకి టి. వి. లో ప్రసారం చేసింది. రెండు గంటల సేపు టాలిన్స్ ఆ ప్రత్యేక యంత్రం ముందు కూర్చుని పని చేశాడు. తన కింద వాళ్ళు అడిగిన ప్రశ్నలని సమాధానాలు చెప్పారు.

ఆ స్టేషన్ మీద ఆరు లక్షల ఆరడుగుల ఎత్తున ఎగిరే గ్లోబల్ పరిమాణంలో ఉండే సెటిలైట్ ఆ యంత్రాల ద్వారా వెలువడే సోలార్ తరంగాలని ప్రసారం చేస్తుంది. సోలార్ తరంగాలు ధ్వని తరంగాలని, దృశ్యతరంగాలని, ఆలోచనా తరంగాలని కలిపి ప్రసారం చేసే గ్రీక్రియనిసోలార్ తరంగాలుగా వ్యవహరిస్తారు.

రెండు గంటల తరవాత—"మిస్టర్ టాలిన్స్! తలుపు తెరవండి" అన్న మాటలు వినపడ్డాయి.

"ఎవరు?" అడిగింది షింపో.

"దుకాణం నించి మీరు కోరిన వస్తువులు తెచ్చాం."

షింపో తలుపు దగ్గరకి వెళ్ళి ఒక స్విచ్ నొక్కింది. బయట నిలబడ్డ వ్యక్తి బొమ్మ తలుపు మీద ఉన్న టి. వి. లో కనపడింది.

"అరవై మూడు ఆరు."

చెప్పింది తలుపు కున్న ఒక మైక్రోఫోన్‌లోకి. ఆమె కంఠధ్వని ఆ అంకెల్ని మైక్రోఫోన్ ద్వారా తలుపుకున్న కంప్యూటర్‌కి అందగానే తలుపుని తెరుస్తుంది కంప్యూటర్. మరో అంకె చెపితే మూసుకుంటుంది. ఎంతమంది ఆ తలుపునితెర వా లనుకుంటే అంతమంది కంఠధ్వనులు వారు చెప్పే అంకెలు ముందరే కంప్యూటర్‌లో అమర్చాలి. తలుపులకి వేరే తాళం చెవు లుండవు.

ఇద్దరు మర మనుషులు తెచ్చిన వస్తువులు తీసుకుని వాళ్ళని పంపించేసింది షింపో. థాంక్స్ లాంటి మాటలేం లేవు వారి మధ్య.

టాలిన్స్ తమ ఫాక్టరీలో పని ఎలా సాగుతూందో చూశాడు. టి. వి. ఆన్ చేసి ఫాక్టరీ చానల్ తిప్పాడు.

ముందరే ప్రోగ్రాం చేయబడ్డ మర మనుషులు తమ తమ పనులని చేసుకుపోతున్నారు. వాటిని సూపర్‌వైజ్ చేసే మరో మనిషి వాటి మధ్య తిరుగుతూ పని ఎక్కౌంట్ట్ వాటిలో అవి పిచ్చాపాటీ మాటాడుకోకుండా గమనిస్తుంది. వారంలో నూటఅరవై ఎనిమిది గంటలూ అవి పని చేస్తూనే ఉంటాయి.

కాసేపు వాటిని గమనించి పని సక్రమంగా నడుస్తుందని తృప్తి పడ్డాడు టాలిన్స్. తన తండ్రికి చేసే ఆపరేషన్ విజయవంతం అవుతుందా? మళ్ళీ ఆలోచనల్లో పడ్డాడు.


పెద్ద బజర్ వినపడింది. టాలిన్స్ గోడకున్న ఫోన్ దగ్గరకి వెళ్ళి ఎదురుగా కూర్చుని "మాట్లాడండి" అన్నాడు. రిసీవర్‌ని ప్రత్యేకంగా ఎత్తక్కర్లేదు. టాలిన్స్, లేదా అతని భార్య షింపో గొంతు గుర్తుపడతుంది ఆ ఫోన్. వెంటనే ఎదురుగా అవతలి వ్యక్తి బొమ్మ కనపడింది.

"స్టేషన్ ఫైల్ నించి మాట్లాడు తున్నాను. మీ నాన్నగారు నార్కోట్ ఇప్పుడే మరణించారు."

"సరే అయితే!"

"ఎవరు?" అడిగింది షింపో. దూరం నించి! చెప్పాడు.

ఒక చిన్న యంత్రం బటన్ నొక్కింది షింపో. అందులోంచి ఒక కథ వినపడసాగింది. ఒక ప్రఖ్యాత వారపత్రికకి ఆమె చందా కడుతూంది. ఆ వారపత్రికలోని కథలు, నవలలు ఆ యంత్రం లోంచి వినపడతాయి. ఒక మానవ కంఠం చదువుతుంది వారపత్రికని. వారం వారం ఆ యంత్రంలోని వజ్రపుముక్కని మారుస్తుంటాయి ఆ ఏకైక వారపత్రిక మర మనుషులు వచ్చి. ఆ వజ్రపుముక్క మీద ఆరుగంటల సేపు వారపత్రిక లోని మేటర్ రికార్డ్ చేయచ్చు.




1982 లో అప్పటి ఆంధ్రప్రదేశ్ లోని ఒక ప్రముఖ వారపత్రిక ప్రచురించిన ఒక కథ అది. 'వెయ్యి సంవత్సరాల క్రితం కథ' అనే శీర్షిక కింద అది అందించ బడుతోంది. అలా వారాని కో కథ మనిషి తన మెదడుతో ఆలోచించి రాసినది వినిపిస్తారు. మిగతావన్ని రచయిత కంప్యూటర్లు" చెప్పే కథలే.

"అప్పట్లో ఎంత వూహాశక్తి గల రచయిత లున్నారు?" చెప్పింది షింపో తన భర్తతో కథ కొద్దిగా విని.

"ఏమిటి?" యథాలాపంగా అడిగాడు టాలిన్స్. అతను ప్రజల మధ్య కమ్యూనికేషన్‌కోసం ఏర్పాటు చేయబడ్డ టి. వి. ముందు బద్ధకంగా కూర్చుని తండ్రి శవాన్ని చూస్తున్నాడు. ఆయన అంత్యక్రియలకి మరమనుషులు ఏర్పాటు చేస్తున్నారు.

పోస్ట్—ఉత్తరాలనే పద్ధతే లేదు. ప్రపంచంలో ఏ మూల నించి ఏ మూలకి ఎవరు సమాచారం పంపదలచుకున్నా కమ్యూనికేషన్ టి. వి. లే ఉపయోగించాలి. రాసిన కాగితాలు డిజైన్లు చూపించా లనుకుంటే టి. వి. లోనే చూపించాలి. పోస్టుపద్ధతి దాదాపు ఆరు వందల సంవత్సరాలక్రితమే క్షీణించి పోయింది.

"వెయ్యేళ్ళ తరవాత మనం ఎలా ఉంటామో వూహించి ఒక కథ రాశారు అప్పటి రచయిత." చెప్పింది షింపో.

ఆ కథలోని కొన్ని వాక్యాలు విన్నాడు టాలిన్స్ కొద్దిగా ఆసక్తిగా.

"వెయ్యేళ్ళ క్రితంలా విద్యుత్ శక్తి వాడకం లేదు. ఆకాశంలో ఇరవై ఆరువేలమైళ్ళ ఎత్తున అమర్చిన ఒక శక్తివంతమైన అద్దం సూర్యకిరణాలని రాత్రిళ్ళుకూడా ప్రతిబింబిస్తున్నాయి. దాంతో చీకటి అనేది ఎవరికీ తెలియదు. గాజు అద్దాల అరల్లోంచి ఎవరికి కావలసిన రంగుల్లో వారికి కాంతికిరణాలు ఇంట్లోకి ప్రసరిస్తాయి. నిద్ర పోవా లనుకున్నప్పుడు మాత్రం ఆ గాజు పలకల్లోంచి సూర్యకాంతి ప్రసరించకుండా ఉండే ఏర్పాటు చేయబడి ఉంది. భూమిమీద జనాభా కేవలం ఇరవై ఆరు లక్షల ముప్ఫై నాలుగు వేలమందే. అన్ని పనులు కంప్యూటర్ల ఆధ్వర్యంలో మరమనుషులే చేస్తుండటంతో ఎంత జనాభా అవసరమో అంతే ఉంటారెప్పుడూ. ఒక్కసంఖ్యకూడా అధికం అవదు. పుట్టబోయే బిడ్డ సెక్స్ ముందరే ఎన్నుకుంటారు."

"షింపో!" పిలిచారు టాలిన్స్ తండ్రి శవదహనం చూసి.

ఏమిటన్నట్టుగా చూసింది.

"ఇక నీకు బిడ్డలు పుట్టకుండా ఇచ్చే ఇంజక్షన్ వచ్చే వారం నించి ఇవ్వరు. నువ్వు తల్లివి కావచ్చు."

"నాకు కొడుకే కావాలి. ఈ కథ రచయిత పేరు గమ్మత్తుగా ఉంది. ఇది పెడదాం." చెప్పింది షింపో సంతోషంగా. ★